బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

చేతివాటంపై చర్యలేవీ..?

◆ ఆర్‌బికెల్లో అక్రమాలు

◆ సొంత ఖాతాలకు రైతుల వాటా డబ్బులు

◆ ఇద్దరు ఎంపిఈఓలు, ఒక విఎఎకు షోకాజ్ నోటీసులు

◆ ఉన్నతాధికారుల పర్యవేక్షణపై విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం

రైతుకు అవసరం అయిన ఎరువులు, విత్తనాలను అందించేందుకు గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీలు ఎపి మార్క్ ఫెడ్, ఎపి సీడ్స్, ఏపీ అగ్రోస్ ద్వారా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై రైతుసేవా కేంద్రాల ద్వారా అందిస్తారు. ప్రభుత్వం అందించే రాయితీ ఎరువులు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలకు రైతు వాటా చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు చెల్లించిన వాటా మొత్తన్ని ఏపీ మార్క్ ఫెడ్, ఏపీ సీడ్స్, ఏపీ అగ్రోస్‌కు రైతుసేవా కేంద్రం సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేయకుండా కొందరు రైతు సేవాకేంద్రం సిబ్బంది రైతువాటాగా చెల్లించిన డబ్బులను వారి ఖాతాల్లో వేసుకున్నారు. ఇప్పటికీ ఆ డబ్బులు సంబంధిత సిబ్బంది వెనక్కు ఇవ్వలేదు. సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం షోకాజ్ నోటీసులతోనే కాలం వెల్లదీస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

2024 ఖరీఫ్, రబీ సీజన్‌లో అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం, మర్తాడు రైతుసేవా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.నరేష్ కుమార్ ఎరువులు అమ్మిన రూ.1.08 లక్షలను ఏపీ మార్క్ ఫెడ్‌కు చెల్లించకుండా తన ఖాతాలో వేసుకున్నారు. ఇది జరిగిన కొన్ని నెలలకు ఆయన అక్కడి నుంచి కూడేరు-2 రైతుసేవా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. తమకు రావాల్సిన డబ్బులు అందకపోవడంతో ఎపి మార్క్‌ఫెడ్ ఈ విషయాన్ని పలుమార్లు వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనమూ లేదు. ఇటీవల ఈ విషయాన్ని అనంతపురం ఎడిఎ జిఎం.అల్తాఫ్ అలీ ఖాన్, డీఏవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు సదరు ఉద్యోగికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదే తరహాలో యాడికి చెందిన ఓ మహిళా ఎంపిఇఒ రూ.2.8లక్షలు చెల్లించలేదు. ప్రస్తుతం ఆమె పెద్దవడుగూరు మండలం కిష్టిపాడులో విధులు నిర్వహిస్తున్నారు. కుందుర్పి మండలం జంబూగుంపల రైతుసేవా కేంద్రం విహెచ్ఎ ప్రవీణ్ 2023-24కు సంబంధించి వేరుశనగ అమ్మిన రూ.11లక్షలు, ఎపి మార్క్ ఫెడ్ సరఫరా చేసిన ఎరువులు అమ్మిన రూ.2లక్షలను సంబంధిత విభాగాలకు చెల్లించలేదు. కళ్యాణదుర్గం మండలం దొడగట్ట ఆర్‌ఎస్‌కెలో ఎంపిఇఒ కరుణాకర్ రూ.1.48లక్షలు తన సొంత ఖాతాలో వేసుకుని 8 నెలలుగా పరారీలో ఉన్నాడు. వీరందరూ సొంతఖాతాలకు డబ్బులను మళ్లించడంపై ఇటీవల పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు. ఈనెల 14న వీరందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. డబ్బుల చెల్లింపుపై సరైన వివరణ ఇవ్వని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఓ ఎంపిఇఒ ఇలా రైతుల డబ్బులను సంబంధిత శాఖకు చెల్లించకుండా సొంతానికి వాడుకోవడంపై ప్రజాశక్తిలో కథనం వెలువడింది. ఈ కథనం రాగానే సదరు ఉద్యోగి తాను వాడుకున్న మొత్తాన్ని వెనక్కు చెల్లించాడు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఆర్‌బికె సిబ్బంది డబ్బులను సొంత ఖాతాలకు మళ్లింపు అంశంలో జిల్లా, డివిజన్ వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం ఉన్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతోనే కింది స్థాయి ఉద్యోగులు రైతు వాటాగా చెల్లించిన డబ్బులను వాడుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతు వాటాగా చెల్లించిన డబ్బులను రికవరీ చేసి, అక్రమానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దేశంపై ట్రంప్ సుంకాల టెర్రరిజం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప 'ట్రంప్ సుంకాల యుద్ధం' బుక్‌లెట్ విడుదల

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విచ్చలవిడిగా సుంకాలు వేస్తూ టారీఫ్ టెర్రరిజంకు పాల్పడుతున్నారని, దీనిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. భారత్‌పై ట్రంప్ సుంకాల యుద్ధం పేరుతో సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన బుక్‌లెట్‌ను శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, డైమండ్ తదితర ఆభరణాలు, మందులు, వస్త్రాలు, ఫార్మా ఉత్పత్తులు, ఆక్వా సముద్ర ఉత్పత్తులు, ఆఖరికి సినిమాలపైన కూడా పన్నులు వేస్తున్నారని తెలిపారు. అనకాపల్లి నుంచి అనంతపురం జిల్లా రాయదుర్గం, పామిడి, శ్రీసత్యసాయి జిల్లాలో వేలాది మంది మహిళలు గార్మెంట్ పరిశ్రమల్లో పని చేస్తున్నారని తెలిపారు. సుంకాలు అధికం కావడంతో ఈ రంగం సంక్షోభంలోకి వెళ్లి కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వీసాల ఆంక్షలపై ఎన్‌ఆర్‌ఐ ఉద్యోగులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని తెలిపారు. ఇదే సమయంలో భారతదేశంలో అమెరికా నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై టారిఫ్‌లు పెంచి ఉత్పత్తిని దెబ్బతీస్తోందన్నారు. ఫలితంగా వేలాది మంది ఉద్యోగులు, కార్మికుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. అమెరికా నుంచి భారతదేశానికి పన్నులు లేకుండా డైయిరీ, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తోందన్నారు. ఇదే జరిగితే భారత దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందన్నారు. గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై దివాళా ఎత్తే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రధాని మోదీ అమెరికా దుశ్చర్యను ఖండించకపోవడం అన్యాయంగా ఉందన్నారు. అమెరికాతో స్నేహాన్ని పునరుద్ధరించుకోవడానికి ట్రంప్ మెప్పు కోసం ప్రజల జీవితాలను ఫణంగా పెట్టడం సరికాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రంప్ ఒత్తిడికి లొంగి వారి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే దేశంలోని డైయిరీ (పాలు, పాల ఉత్పత్తులు) మొక్కజొన్న, పండ్లు, ఆఖరికి గోధుమలు కూడా దిగుమతి అవుతాయని తెలిపారు. అమెరికా సుంకాల దుర్మార్గ దాడిని ప్రజలు ప్రశ్నించాలన్నారు. అన్ని పార్టీల్లోని ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులు సుంకాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజాపోరాటాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.నాగమణి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గోపాల్

నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నగర అధ్యక్షుడు గోపాల్ అన్నారు. శనివారం నగరంలో మున్సిపల్ యూనియన్ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలో పలు సమస్యలతోపాటు అవినీతి తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. మున్సిపల్ ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకుని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆరు సర్కిళ్లలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ల అవినీతి ఏరులై పారుతోందన్నారు. ప్రశ్నించిన కార్మికులపై వివక్ష చూపుతూ పని భారాన్ని మోపుతున్నారన్నారు. జీతాల్లో కోత విధిస్తున్నారని, కార్మికుల పని మార్చినా, బదిలీలు చేయించుకున్నా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో మాదిరి మెడికల్ విభాగం నుంచి శానిటరీ ఇన్స్‌పెక్టర్లను తీసుకురావాలన్నారు. కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తుంటే వారి యోగక్షేమాలు, ఆరోగ్యం గురించి పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. ఇప్పటికే పని చేస్తూ 10 మంది వరకు చనిపోయినా, వారి కుటుంబాల్లో ఉద్యోగాలు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పనిముట్లు, కొబ్బరి నూనె, చెప్పులు, దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి తిరుమలేష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో నకిలీ సర్టిఫికెట్ల బాగోతం..!

◆ ఉద్యోగోన్నతుల కోసం అడ్డదారులు

◆ స.హ.చట్టంతో నకిలీ వ్యవహారం బహిర్గతం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగోన్నతుల వేళ నకిలీ సర్టిఫికెట్ల బాగోతం వెలుగు చూస్తోంది. సాధారణంగా ఉద్యోగుల నూతన నియామకం కారుణ్య నియామకాల సమయంలో విద్యార్హతలను బట్టి అటెండర్, రికార్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ల నియామకాలు జరుగుతాయి. ఉద్యోగుల విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికెట్లను జాయినింగ్ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. కార్పొరేషన్‌లో నిర్దేశిత విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను కారుణ్య నియామకం జరిగినప్పటి నుంచి ఐదు సంవత్సరాలలోపు అందజేస్తామని పేర్కొంటూ కొందరు జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులయ్యారు. ఇలా కొందరు ఉద్యోగ విధుల్లో చేరి ఐదు సంవత్సరాల దాటినా సంబంధిత సర్టిఫికెట్లను సమర్పించకుండానే ఇంక్రిమెంట్లను పొందారు. వాటిని సర్వీస్ రిజిస్టర్‌లో సైతం నమోదు చేయించారు. నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల సమర్పణ తర్వాతనే ఇంక్రిమెంట్ల తీసుకున్నట్లు ఎస్ఆర్‌లో నమోదు చేయించాల్సి ఉంటుంది. ఇలాంటి తతంగం ఏమీ లేకుండానే కార్పొరేషన్‌లో కొందరు గుమాస్తాలు ఇంక్రిమెంట్లను దర్జాగా డ్రా చేసినట్లు తెలుస్తోంది.

మూడేళ్లుగా పెండింగ్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన

కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పోటీపడుతున్న ఉద్యోగులు ప్రస్తుతం హడావుడిగా సర్టిఫికెట్లను అందజేశారు. ఇందులో చాలా పత్రాలు ఇతర రాష్ట్రాలలో గుర్తింపు పొందని యూనివర్శిటీల నుంచి తీసుకొచ్చి అందజేసినట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్లు సమర్పించిన తర్వాత అవి నిజమైనవా లేక నకిలీవా అన్న అంశం నిర్ధారించడానికి జెన్యూన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం బోర్డుకి పంపాల్సి ఉంటుంది. సాధారణంగా 20 రోజుల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిపి, అవి నిజమైనవా.. లేక నకిలీవా.. అన్న అంశంపై విచారణ జరిపి ఆయా మున్సిపల్ కార్పొరేషన్లకు బోర్డు నుంచి సమాచారం పంపుతారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి సర్టిఫికెట్లు తీసుకొచ్చి అందజేసిన ఉద్యోగుల సర్టిఫికెట్లు గడచిన మూడేళ్లుగా బోర్డులోనే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇటీవల రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే ఒక ఉద్యోగి డిగ్రీ విద్యార్హతను పూర్తిచేసుకుని సంబంధిత పత్రాలను కార్పొరేషన్ కార్యాలయంలో అందజేశారు. ఈ విద్యార్హత పత్రాల పరిశీలన నిమిత్తం బోర్డుకు పంపారు. 15 రోజుల్లోపు వీటిని పరిశీలించి అవన్నీ అసలైన పత్రాలనే నివేదికను కార్పొరేషన్‌కు పంపారు. 15 రోజుల సమయంలోనే ఒక ఉద్యోగి పంపిన పత్రాల పరిశీలన పూర్తి చేసుకుని రాగా, మూడేళ్ల క్రితం పంపిన వాటి పరిస్థితి మాత్రం ఇంకా తెలియడం లేదు. మూడేళ్ల క్రితం పంపిన వాటిలో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నాయా.. లేక ఆ పత్రాలను అడ్డుపెట్టుకుని కాసుల వ్యాపారానికి కొందరు ఉద్యోగులు ఎవరైనా తెరలేపారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

స.హ.చట్టంతో వెలుగు నకిలీ సర్టిఫికెట్ల బాగోతం

కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల జాబితాలో విద్యార్హత లేని వారి పేర్లను చేర్చారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఉద్యోగోన్నతికి అన్ని అర్హతలుండి, ఉన్నత విద్య చదివిన ఓ ఉద్యోగి ఉద్యోగోన్నతుల జాబితా తయారీపై సంబంధిత అధికారులను ఇటీవల ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సదరు ఉద్యోగ అభ్యర్థనను పరిగణలోకి తీసుకోకుండా సీనియార్టీ జాబితా తయారీలో పక్షపాత ధోరణిని అవలంభించడంతోనే ఉద్యోగ వర్గాల్లో విభేదాలు బహిర్గతం అయినట్లు సమాచారం. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో ఉన్న వారి విద్యార్హతలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ప్రకారం ఉద్యోగి దరఖాస్తు చేసి వివరాలు సేకరించినట్లు చర్చ నడుస్తుంది. ఈ వివరాలు అందడంతో సీనియార్టీ జాబితాలో ఉన్న వారి విద్యార్హతలతో పాటు మరికొందరు ఉద్యోగుల విద్యార్హతలు సైతం బోగస్‌వని తేలినట్లు సమాచారం. గతంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసి, ప్రస్తుతం మరో విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి విద్యార్హతలు సైతం నకిలీవిగా తేలినట్లు తెలుస్తోంది. సమాచార హక్కు విషయంలో ఉద్యోగోన్నతుల జాబితాలో ఉన్న వారి వివరాలు తీసుకోకుండా అందరివీ ఎందుకు తీసుకుంటున్నావంటూ పలువురు అధికారులు సమాచారం అడిగిన ఉద్యోగితో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఓ వైపు నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం నడుస్తుండగానే మరో వైపు జాబితాలో ఉన్న వారు దొడ్డిదారిన ఉద్యోగోన్నతి పొందేందుకు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నకిలీ సర్టిఫికెట్ల బాగోతంపై కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుని ఉద్యోగోన్నతుల అంశాన్ని పూర్తి చేస్తారన్న దానిపై ఉద్యోగ వర్గాల్లో సర్వత్రా చర్చ నడుస్తోంది.

సారూ..కలెక్టర్ మారారు..

పాత కలెక్టర్ ఫొటోలతోనే 'స్వచ్ఛాంధ్ర' అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి-గుంతకల్లు

'సారూ.. పాత కలెక్టర్ మారారు.. కొత్త కలెక్టర్ వచ్చారు..' అంటూ పలువురు చర్చించుకున్నారు. ఎందుకంటే శనివారం పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాత కలెక్టర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీని ప్రదర్శించడం పలు విమర్శలకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. గత కలెక్టర్ వినోద్‌కుమార్ బదిలీ అయి కొత్త కలెక్టర్ ఆనంద్ సెప్టెంబర్ 13వతేదీన బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. నూతన కలెక్టర్ వచ్చి నెలరోజులు దాటినా మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు, మున్సిపల్ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఎందుకంటే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించే ఫ్లెక్సీలపై పాత కలెక్టర్ వినోద్‌కుమార్ చిత్రాలు ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని చెప్పవచ్చు. శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న వాటర్‌ట్యాంకు వద్ద ప్రతినెలా మూడవ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాత కలెక్టర్ వినోద్‌కుమార్ ఉన్న ఫెక్సీతోనే కార్యక్రమం నిర్వహించడం బాధాకరం. అదేవిధంగా మరో ఫ్లెక్సీలో ఛైర్‌పర్సన్ భవాని ఫొటో తర్వాత కమిషనర్ ఫొటో ఉండాల్సి ఉండగా ప్రొటోకాల్‌ను విస్మరించి కమిషనర్ ఫొటో ముందు వేయించుకోవడం విశేషం. ఇప్పటికైనా కమిషనర్ నయీమ్‌అహ్మద్, ఇతర శాఖల అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

పాత కలెక్టర్ ఫొటోలతోనే ప్రదర్శిస్తున్న ఫ్లెక్సీ

సమ్మె విరమణ సరికాదు..

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విరమించడం విడ్డూరంగా ఉందని సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. శనివారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో విద్యుత్ సిఐటియు అనుబంధం స్ట్రగుల్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ప్రధానంగాకాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల రెగ్యులర్, గ్రేడ్.2 సమస్యలు, పాత పెన్షన్ వర్తింపజేయాలనే డిమాండ్‌లు ఉన్నాయన్నారు. ఆయా అంశాలపై జెఎసి సమ్మెకు పిలుపునిస్తే పరిష్కరించకుండా సమ్మె విరమించుకోవడం శోచనీయమన్నారు. విద్యుత్ సంస్థను ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లే విధానాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించుకుని.. ప్రధాన డిమాండ్లు నెరవేర్చే వరకూ దశలవారీ ఆందోళనలకు సిద్ధం అవుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి నాయుడు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థినికి రాష్ట్ర ప్రథమ బహుమతి

అనంతపురం : 'సూపర్ సేవింగ్స్-సూపర్ జిఎస్‌టి'పై రాష్ట్రస్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఐఐఐ బిఎ పొలిటికల్ సైన్స్ విద్యార్థిని దీపశ్రీ ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా చంద్రబాబుతో దీపశ్రీ బహుమతిని అందుకున్నారు. బహుమతి సాధించిన విద్యార్థినిని ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డి.సహదేవుడు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

చంద్రబాబుతో ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని దీపశ్రీ

విజయవంతంగా ఐద్వా మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభకు అనంతపురం వేదికైంది. ఈ వారంలో మూడు రోజులపాటు అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు ఎంతో ఉత్సహపూరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రంలో మహిళా సమస్యలను చర్చించడంతోపాటు, వారి సమస్యలపై రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాల్సిన పోరాట వ్యూహాలను రచించారు. ప్రధానంగా రాష్ట్రంలో మహిళలు పడుతున్న ఇబ్బందుల్లో రుణభారాలపై ఎక్కువగా చర్చకొచ్చింది. మైక్రోఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని మహిళలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని ఈ మహాసభలో చర్చకొచ్చింది. మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసామని పాలకులు చెబుతున్నా ఆచరణలో పరిస్థితి భిన్నంగా ఉందన్న అంశం చర్చకొచ్చింది. డ్వాక్రాలోనూ రెండు రూపాయలకుపైగా వడ్డీ పడుతోందని ఐద్వా ప్రతినిధుల చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మహిళలను ఈ సంఘాలు పీక్కుతీనేవిగా మరాయని ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వం రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలందివ్వాలని మహాసభ డిమాండ్ చేసింది. ఇది టిడిపి ఎన్నికల హామీలోనూ ఉందని గుర్తు చేశారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.1500 ఇస్తామన్నది అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక మహిళపై జరుగుతున్న హింస అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపైన ఈమూడు రోజుల మహాసభ చర్చించింది. ఈ మహాభలో జాతీయ నాయకులు ఆసాంతం పాల్గొని దిశా నిర్దేశం చేయడం గమనార్హం. సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి శ్రీమతి టీచరు, మరియం ధావలే, పుణ్యవతిలు పాల్గొన్నారు. ఈ మూడు రోజులు ప్రతినిధులు ఎంతో ఉత్సహంతో పాల్గొని రాష్ట్రంలోని మహిళల సమస్యలపై చర్చించారు. రాబోయే మూడు సంవత్సరాలు కావాల్సిన కార్యచరణ రూపొందించారు.

ఈ వారం రబీ పంటలసాగుపై చర్చకొచ్చింది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో పంటల సాగు ఆశించినంత జరగలేదు. సీజన్ మొత్తంలో ఆగస్టు ఒక్కటే వర్షపాతం నమోదయింది. అది కూడా ఆ నెలలో 90 శాతంపైన వర్షపాతం నమోదయింది. తక్కిన అన్ని నెలలు వర్షాభావమే నెలకొంది. దీంతో అటు ఖరీఫ్‌లోనూ, ఇటు రబీలోనూ పంటల సాగు ప్రశ్నార్థకమే అయింది. ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. సీజన్‌లో పడకపోవడంతో ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయమైన ఇచ్చి రైతులను ఆదుకునే వారు ఈసారి ప్రత్యామ్నాయం ఊసే లేకుండా చేశారు. ఇక రబీలోనూ పప్పుశనగపై దృష్టి సారించలేదు. ఈ సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో రబీలోనూ పంటల సాగు ఆశించినంత ఉండే అవకాశం లేదు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షాలు పడుతున్నా అనంతపురం జిల్లాలో మాత్రం వర్షపాతం సరిగా లేదు. కారు మబ్బులు కమ్ముకుని రావడం, కొద్దిసేపు తేలికపాటి వర్షం పడిపోతోంది. దీని మూలంగా పదును లేక పంటలు సాగవడం లేదు. ప్రధాన నదుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలుకు నీరు బాగా వస్తోంది. ఈనీటి వినియోగంపై ఈసారి ఇప్పటి వరకు సాగునీటి సలహా మండలి సమావేశమే నిర్వహించలేదు. దీన్ని బట్టి ప్రభుత్వానికి వ్యవసాయంపై ఏ మేరకు శ్రద్ధ ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్-పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాప్తాడు

చెకుముకి ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, తదితరులు

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పిటిసి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు తుమ్మల రాజేశ్వరి అధ్యక్షతన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ ప్రజల్లో సైన్స్ ప్రాతిపదికన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతోనే జన విజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. సైన్సు, శాస్త్రీయ పరిజ్ఞానం అనేవి ఒక తరగతి గది, ఒక హైస్కూల్‌కు పరిమితం కాదన్నారు. ఈ రెండూ విశ్వవ్యాప్తమైనవన్నారు. మానవ జీవితానికి నష్టం కలిగించే ఆచారాలు, నమ్మకాలను వ్యతిరేకిస్తూ ప్రయోగానికి తట్టుకుని నిలబడగలిగే నిజమైన వాటిని మాత్రమే జెవివి ప్రచారం చేస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఇతరులు చెప్పిన ప్రతి విషయాన్నీ నమ్మకూడదన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే సంపూర్ణ జ్ఞానాన్ని పొందుతారన్నారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలతో కూడిన ఆచారాలను నమ్మి మోసపోయిన వాళ్లు సమాజంలో అనేకంగా ఉన్నారన్నారు. వీటన్నిటికీ ఒక్కటే పరిష్కార మార్గం శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి నడుచుకోవడమే అన్నారు. చెకుముకి సంబరాల్లో 1050 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలిపరు. అనంతరం చెకుముకి ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, రాప్తాడు మండల విద్యాధికారి కె.కుళ్లాయప్ప, నాయకులు ఎం.శాంతరాజు, ఉపాధ్యాయులు లక్ష్మన్న, రోజారమణి, సరస్వతి, గ్రేస్, అంజనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : శాస్త్రీయ ఆలోచనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన అన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం బైరవనగర్‌లోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ నాడు ఆకలి కోసం వేటతో మొదలైన శాస్త్రీయ ఆలోచన నేడు ఇంతటి సాంకేతిక అభివృద్ధికి కారణమైందన్నారు. నేటికీ మూఢనమ్మకాలు అశాస్త్రీయ భావాలు మానవుని మనుగడకు అడ్డంకిగా మారాయని తెలిపారు. వాటిని శాస్త్రీయ దక్పథంతో కలిగిన ఆలోచనతో మాత్రమే ఎదుర్కోగలమన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి జన విజ్ఞాన వేదిక ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తుందని అది స్కూల్ స్థాయి నుంచే మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కొండారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ రెడ్డి, జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, నగర అధ్యక్ష కార్యదర్శులు సాకే తిరుపాల్, ప్రసాద్‌రెడ్డి, కోశాధికారి రామిరెడ్డి, నగర నాయకులు ముత్యాలు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఉపాధ్యాయులు వీర నాగప్ప, అంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయశ్రీ

ప్రజాశక్తి-అనంతపురం

మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయశ్రీ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర దినోత్సవంలో భాగంగా శనివారం స్థానిక మెడికల్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంధనంతో నడిచే వాహనాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. నాటిన మొక్కలు సంరక్షించే బాధ్యతలను తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.షారోన్ సోనియా మాట్లాడుతూ వైద్య విద్యార్థులు సైకిళ్ల వాడకాన్ని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.మధు, ఫిజియాలజీ విభాగాధిపతి సరళ, అనాటమీ విభాగాధిపతి ఉమామహేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ నరేంద్ర, ఎస్పిఎం అసోసియేట్ ప్రొఫెసర్ ఆది నరేష్, ఫార్మకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆశాలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లలితాభవాని, సుమన గోపీచంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వక్తలు

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పోలేపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చిన్నారులకు అందిస్తున్న ఆహారం, సదుపాయాలపై ఆరాతీశారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన వాల్మీకి మహర్షి జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న పోతుల కిష్టప్పను పరామర్శించి ఆయనకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. తర్వాత గ్రామ సమీపంలోని పంట పొలాలు, హంద్రీనీవా జలాలతో నిండిన చెరువును పరిశీలించారు.

అంగన్వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల (ఫ్రెషర్స్) డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల విద్యాభివృద్ధికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 15 రోజులకు ఒకసారి కళాశాలకు వచ్చి తమ పిల్లల విద్యాభ్యాసం, మార్కుల వివరాలను తెలుసుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్ కోసం బాధ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రోగ్రెస్ సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం కళాశాల సుందరీకరణలో భాగంగా తరగతి గదులు, ప్రహరీలకు రంగులు వేయించేందుకు సహాయ సహకారాలు అందించిన పూర్వ విద్యార్థులు ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, నజీర్, చంద్రశేఖర్ ఆజాద్, సయ్యద్యూనస్, మహేష్, వర్తకులు సిద్దేశ్వర, తిప్పేస్వామి, తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, అధ్యాపకులు పి.నగేష్, కె.వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సిటీ మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సహకారంతో రాయదుర్గంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల జర్నలిస్టుల పునఃశ్చరణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విలేకరులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ విలేకరులకు గృహ నిర్మాణ పథకం అమలు, కొత్త అక్రిడేషన్ జారీ, రిటైర్డ్ పాత్రికేయులకు పెన్షన్ చెల్లింపు, ప్రమాద ఆరోగ్య బీమా మొదలైన అంశాలను ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, సీనియర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్కుమార్, డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ శ్రీశైలం రమేష్, సీనియర్ జర్నలిస్టు రామచక్రయ్య, జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యజాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండప్ప, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పురుషోత్తం కుమార్, చలపతి, జిల్లా కోశాధికారి చౌదప్ప, రాయదుర్గం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మప్ప, కలాంఖుద్దు, గురు రాఘవేంద్ర ప్రసాద్, ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

నేడు రక్తదాన శిబిరం

రాయదుర్గం : అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పోలీస్ ఇన్స్పెక్టర్లు జయనాయక్, వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువకులు భారీ ఎత్తున తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

IN THE COURT OF THE III ADDITIONAL CIVIL JUDGE AND JMFC AT BALLARI
O.S. NO. 216/2023

BETWEEN:
Smt.Indiramma and others ....Plaintiff
AND
Sri. Regula Ramanjiniyalu ...Defendant
TO
DEFENDANT No.1 (a) to (c)
D1(a) Smt Anusuyamma W/o Late Regula Ramanjiyulu, aged about 58 years, house wife, R/o Donekallu village, Uravakunda taluk, Ananthapura District, Andra Pradesh.
D1(b) Ashok Kumar S/o Late.Regula Ramanjiyulu, aged about 38 years, R/o Donekallu village, Uravakunda taluk, Ananthapura District, Andra Pradesh.
D1(c) Radha D/o Late. Regula Ramanjiyulu, aged about 33 years, R/o Donekallu village, Uravakunda taluk, Ananthapura District, Andra Pradesh.

NOTICE ON IA No.3 TO 5

WHEREAS, the above named petitioners have filed the above case against the defendant seeking for specific performance of contract against the defendant in respect of the suit schedule property and the defendant was reported as death left you No.1 to 3 and then plaintiffs have immediately filed LRs application i.e. IA No. 3 to 5, to bring the LRs of defendant ie. you No.1 to 3 ie. defendant No.1(a) to (c) on record.

You are hereby noticed that to appear before this Hon'ble court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the case or who shall be instructed and able to answer all such question on the day of 20-11-2025 at about 11:00 "O" clock in the forenoon to answer the claim and further you are hereby directed to file on that day your objections and to produce on the said day all documents in your possession or power upon which, you base your defense or claim for set off or counter claim in support of your defense.

Take notice that in default of your appearance on the day before mentioned, the case will be heard and determined in your absence.

Given under my hand and seal of the Court on this 17 day of October 2025.

By Order of the Court
SHIRESTHEDAR
Principal civil Judge, Ballari

(G. VEERESH)
Advocate for Petitioner

'సూర్యఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లండి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, పథకం నోడల్ ఏజెన్సీ సుమ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు కేవలం 50 యూనిట్లు మాత్రమే ఏర్పాటు కావడం విచారకరమన్నారు. ఈ ప్రాంతంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున యూనిట్లు ఎక్కువగా ఏర్పాటూతే విద్యుత్ ఉత్పత్తితో పాటు ఉష్ణోగ్రత తగ్గి విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. విద్యుత్ సంస్థ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం మూడు రకాల్లో లబ్ధిదారులు ఎన్నుకోవచ్చన్నారు. సూర్యరశ్మి అధికంగా ఉండటం, విద్యుత్ ఉత్పత్తి, కరెంటు బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ నోడల్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాసులు, గోపీ, విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్లు సలీం, బాలచంద్ర, టిడిపి నాయకులు నాగరాజు, హనుమంతు, పురుషోత్తం, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంటౌన్ : కేంద్రంలోని ఎన్డిఎ ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు ఆర్థికభారం తగ్గించేందుకు ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ కోరారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఇఇ రాజశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2లక్షలు విలువజేసే సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే సుమారు రూ.79వేలు రాయితీ వర్తిస్తుందన్నారు. బిసి వర్గాలకు చెందిన వారికి అదనంగా మరో రూ.20వేలు రాయితీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంలో సూర్యఘర్ పరికరాలను పరిశీలిస్తున్న విప్ కాలవ

శింగనమల : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద పేదలకు సబ్సిడీతో అందిస్తున్న సోలార్ విద్యుత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ భాస్కర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం 78 శాతం సబ్సిడీతో ప్రజలకు సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రజలకు బ్యాంకు ద్వారా లోన్‌రూపంలో రూ.2,45,000లో 78 శాతం సబ్సిడీతో సోలార్ విద్యుత్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎడిఇ రఘునాథ్, ఇన్‌ఛార్జి ఎఇ విజయ్‌కుమార్, రంగ రాయల చెరువు ఆయకట్టు ఛైర్మన్ జి.సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణుల రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ. పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, విద్యుత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మె విరమణ శోచనీయం

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికుల ప్రధాన డిమాండ్లు నెరవేరకుండా సమ్మె విరమణ చేయడం శోచనీయమని విద్యుత్ కార్మికుల స్ట్రగుల్ కమిటీ నాయకులు, సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల రెగ్యులర్, గ్రేడ్.2 సమస్యలు, పాత పెన్షన్ వర్తింపజేయాలనే డిమాండ్‌లు ఉన్నాయన్నారు. ఆయా అంశాలపై జెఎసి సమ్మెకు పిలుపునిస్తే పరిష్కరించకుండా సమ్మె విరమించుకోవడం శోచనీయమన్నారు. విద్యుత్ సంస్థను ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లే విధానాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించుకుని.. ప్రధాన డిమాండ్లు నెరవేర్చే వరకూ దశలవారీ ఆందోళనలకు సిద్ధం అవుతామని స్పష్టం చేశారు.

ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి

టిబి హెల్త్ విజిటర్ జయవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న జయవర్ధన్‌రెడ్డి

ధూమపానం, మద్య పానానికి దూరంగా ఉండటం వల్ల టీబీ వ్యాధిని పూర్తిగా నిరోధించగలమని టిబి హెల్త్ విజిటర్ జయవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జీసెస్‌నగర్‌లోని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధి మైకో బ్యాక్టీరియం టిబెర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా నుంచి వస్తుందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినా, తుమ్మినా తుంపర్ల రూపంలో వాతావరణంలో చేరి ఆరోగ్యవంతులు ఆ గాలి పీల్చుకుంటే వ్యాప్తి చెందుతుందన్నారు. క్షయ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా లభ్యమవుతాయన్నారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా సకాలంలో మందులు తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి సీనియర్ ట్రీట్మెంట్ సూపెర్వైసోర్, కళాశాల ఎఒ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు నార్పల విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

నార్పల : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో నార్పల బాలికల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న కారుణ్య, ఆఫ్రిన్, నవంబర్ 1వ తేదీన మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో పదవ తరగతి చదువుతున్న శ్రావణి నవంబర్ మూడో వారంలో నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు.

ముందస్తు దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

ఇటుకలపల్లి సమీపంలోని అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, సిఎఒ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు శాలిని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతలక్ష్మిలో వివరిస్తున్న వక్తలు

సాయివిజ్ఞాన్‌లో..

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయులు జి.లావణ్యరామ్ దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి

ప్రజాశక్తి-రాప్తాడు

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కరస్పాండెంట్ విబిఆర్ శర్మ, ఛైర్మన్ విబి కృష్ణారెడ్డి, వైస్‌ఛైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఉత్సాహ భరితంగా సాగింది. ఈ సందర్భంగా రెండవ సంవత్సరం విద్యార్థులు, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహబంధం, నైతిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎండి వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ జి.శ్రావణి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, హెచ్ఎస్ విభాగాధిపతి ఎ.చంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నేడు 'నివ్య ఆటోమొబైల్స్' షోరూం ప్రారంభం

హాజరుకానున్న సినీనటి మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగర సమీపంలోని శిల్పారామం ముఖద్వారం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'నివ్య ఆటోమొబైల్స్' షోరూంను రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఆదివారం ప్రారంభించనున్నారు. విశిష్ట అతిథిగా ప్రముఖ సినీనటి మీనాక్షిచౌదరి హాజరవుతున్నట్లు నివ్య ఆటోమొబైల్స్ (మారుతి సుజుకి ఏరిన డీలర్) అధినేత మల్లు ప్రసాద్‌రెడ్డి, మల్లు నివేదితారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోమొబైల్స్ రంగంలో సుదీర్ఘమైన అనుభవంతో నివ్య ఆటోమొబైల్స్ షోరూంను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. మారుతీ సుజుకి సెగ్మెంట్‌లో నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించేందుకు ముందుకొస్తున్న తమను ఆదరించాలని కోరారు.

విద్యుత్ కాంతుల్లో నివ్య ఆటోమొబైల్స్ షోరూం

ఎంపిపి పెద్దన్నను తొలగించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బెలుగుప్ప

అవిశ్వాస తీర్మానం పెట్టి మండల ఎంపిపి పెద్దన్నను తొలగించడమే లక్ష్యమని వైసిపి నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైసిపి నాయకులు శివలింగప్ప స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు శివలింగప్ప, మండల అధ్యక్షులు చిన్న మచ్చన్న మాట్లాడుతూ వైసిపి నుంచి ఎంపిటిసిగా గెలుపొందిన ఎంపిపి పెద్దన్న, మరో వైసిపీ నాయకుడు శివలింగప్ప భార్య వరలక్ష్మికి ఒక్కొక్కరికి రెండున్నర సంవత్సరాలు మండల ఎంపిపిగా కొనసాగాలని ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే టిడిపి ప్రభుత్వం గెలిచాక ఆయన స్వార్థం కోసం టిడిపి చేరారన్నారు. దీంతో ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఎంపిపి పదవి నుంచి తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, 8 మంది ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకుందాం : ఎంపిపి

ప్రజాశక్తి-బెలుగుప్ప

కలిసికట్టుగా పని చేసి మండలంలోని పలు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకుందామని ఎంపిపి పెద్దన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎఒ పృథ్వీసాగర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపిపి పుష్పావతి, టిడిపి నాయకులు తగుపర్తి రాధాకృష్ణ, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, సర్పంచు రామ్మోహన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి పెద్దన్న

భావితరాలకు ఖరీదు కానున్న వైద్య విద్య

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

భావితరాలకు వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది కాబోతోందని ఎఐబిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.శ్రీరాములు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఇంకా తప్పటడుగులు వేస్తున్నట్టుగానే ఉందన్నారు. వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తే భవిష్యత్తు తరాల వారికి వైద్య విద్య అందని ద్రాక్ష అవ్వబోతోందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు.

నాణ్యత లేని ఎరువులు విక్రయించాడని ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం

నాణ్యత లేని ఎరువులు విక్రయించాలని కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన రైతు ఎం.లక్ష్మీనారాయణ ఎరువుల దుకాణదారుడిపై శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని అనంతపురం డివిజన్ ఎడిఎ జిఎం అల్తాఫ్‌ను ఆదేశించారు. దీంతో అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటాకుమార్‌తో కలిసి బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీసాయి గణేష్ ఆగ్రో ఏజెన్సీస్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బాధిత రైతుకు పంపిణీ చేసిన ఎరువుల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు ఎడిఎ తెలిపారు.

మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు మంజూరు

అనంతపురం : అనంతపురం మెడికల్ కళాశాలకు 15 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు మంజూరయ్యాయి. ఇందులో మూడు విభాగాలకు ముందు ఉన్న సీట్లకు అదనంగా 12 సీట్లు పెంచారు. కొత్తగా 3 హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు మంజూరయ్యాయి. పీజీ సీట్లు మంజూరు చేయడంపై ఆసుపత్రి మెడికల్ కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

వివాహానికి ఆర్థికసాయం

అనంతపురం : గార్లదిన్నె మండలంలోని కల్లూరు ఆర్ఎస్‌లో నివాసం ఉంటున్న బోయ హనుమంతు కూతురు గౌతమి వివాహానికి ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా ఈరాలప్ప

డి.హీరేహాల్ : యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా ఈరాలప్ప నియమితులయ్యారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులతోపాటు ప్రధాన కార్యదర్శిగా హనుమంతప్పను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. అలాగే కన్నడ ఉపాధ్యాయుల సమస్యలపై మండలంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు.

26న మదనపల్లిలో జాతీయ శతాధిక కవిసమ్మేళనం

అనంతపురం : ఈనెల 26వతేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లిని శ్రీరామ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమ్మేళనంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, ఒడిస్సా , గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మందికిపైగా కవులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

నార్పల : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చామలూరు గ్రామంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష లేకుండా ఎలా జీవించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఒఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, రామకృష్ణ, పిఇ ఆదిలక్ష్మి, రాణి పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల సత్తా

అనంతపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ అండర్-14, 17 జిల్లా సెలక్షన్స్‌లో అనంతపురం విద్యార్థులు సత్తాచాటారు. అలాగే ఆర్డీటీ మైదానంలో బాస్కెట్‌బాల్ అండర్-14, 17 జిల్లా సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌బాబు, ఓబిలేసు, ఆంజనేయులు, సుగుణమ్మ, నాగరాజు, జగదీష్, జ్యోతి, లతదేవి, వెంకటేష్, రమేష్, శ్రీనివాసులు, సిరాజుద్దీన్, రాజశేఖరరెడ్డి, శిరీషా, నాగేంద్ర, పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి : డిఇఒ

బుక్కరాయసముద్రం : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబు సూచించారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేసి.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లింగానాయక్, డిఇఒ కార్యాలయ ఎఎస్ఎ శ్రీనివాసులు, ఎపిఒ మంజునాథ్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, క్లస్టర్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అనంతపురం : యూత్ రెడ్‌క్రాస్, రెడ్డి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛంగా ఇచ్చిన దాదాపు 52 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ అన్నిదానాల కన్నా రక్తదానం మిన్న అన్నారు. అంతేగాకుండా రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అన్నారు.

నేడు సుబ్బరాయుడు సంస్మరణ సభ

అనంతపురం : రాయలసీమ సాగునీటి ప్రాజక్టులపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి అనేక ప్రతిపాదనలను రూపొంది, సాధనకు కృషి చేసిన సుబ్బరాయుడు వర్థంతిని ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో నిర్వహించనున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కారుణ్య నియామకం

అనంతపురం : పామిడి ఎడిసిసి బ్రాంచిలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన రమేష్‌నాయక్ సోదరుడు మోషన్‌నాయక్‌కు శనివారం నియాకమపత్రం అందజేశారు. పామిడి బ్రాంచిలో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయక్ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో సోదరుడు మోషన్‌నాయక్‌ను నియమిస్తూ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఇఒ సురేఖరాణి, డిజిఎం రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో తహశీల్దార్ ముఖాముఖి

యాడికి : మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థల విద్యార్థులతో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి శనివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు-తహశీల్దార్ మధ్య ఆసక్తికర సంభాషణలు కొనసాగాయి. ఇందులో భాగంగా భూముల రికార్డులు అంటే ఏమిటి? మ్యుటేషన్ అంటే ఏమిటి? మెజిస్ట్రేట్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అంటే ఏమిటి.. వారి విధులు.. తహశీల్దార్ కార్యాలయంలో ఏఏ పనులను చేస్తారు.. ఏ విధంగా సేవలందిస్తారనే విషయాలను విద్యార్థులకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుత్తి : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ ఆచారి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.శ్వేత పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గుత్తిలో న్యాయమూర్తులు, న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎజిపి ఫక్రుభాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పీడీ రత్నం, సీనియర్ న్యాయవాదులు నూర్ మొహమ్మద్,విసి. గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాధిక్ వలి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలం ఇసురాళ్లపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇసురాళ్లపల్లికి చెందిన మారుతి, శివ, గంగయ్య ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో తిరుమలేశ్ అనే విద్యార్థి ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఆర్ఐటి విద్యార్థికి..

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని చెరువు కట్టపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఆర్ఐటి కళాశాలకు చెందిన విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. సిఐ పుల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్ఐటిలో ఆఖరి సంవత్సరం చదువుతున్న భరత్‌కుమార్‌రెడ్డి స్కూటీపై అనంతపురంలోని స్వగృహానికి వస్తుండగా చెరువు కట్టపైకి రాగానే వెనుక నుంచి వచ్చిన ఓ టిప్పర్ ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొంది. దీంతో భరత్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.